క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: లింగాలగణపురం మండలం పటేల్ గూడెం గ్రామ రెవెన్యూ శివారులో నాలుగేళ్ల క్రితం గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న నిరుపేదలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, జోగు ప్రకాష్, పాత్క నూరి ఉపేందర్, గోసంగి శంకరయ్య దేవాదానం, రవి, తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మతల్లికి పూజలు



పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో మాదిగ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య బుధవారం ఎల్లమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ మాదిగ కుల పెద్దలు, దేవాలయ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా హాజరైన రాజయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మతల్లి దీవెనలు గ్రామ ప్రజలపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామ మాదిగ కుల పెద్దలు, దేవాలయ కమిటీ బాధ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో అర్హులను కాదని అనర్హులకు మెజార్టీ శాతం అందించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో బుధవారం రాస్తారోకో చేపట్టారు. బీఆర్ఎస్ ఘన్‌పూర్ పట్టణ అధ్యక్షుడు మునిగెల రాజుముదిరాజ్ అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట రైల్వేగేటు–గాంధీ చౌరస్తా రోడ్డుపై రాస్తారోకోతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. మునిగెల రాజు, బంగ్లా శ్రీనివాస్, పెసరు సారయ్య, మారెపల్లి ప్రసాద్, ఊరడి లింగం, కృష్ణారెడ్డి, పార్శి రంగారావు, పులి శ్రీనివాస్, నక్క ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన చెక్క కళ-కనుకయ్య దంపతుల కూతురు శిరీష వివాహానికి గ్రామ సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ బుధవారం రూ. 5వేల సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కనుకయ్య, సత్తయ్య, విట్టల్, శ్రీనివాస్, ఆనందం ఉన్నారు.

బాధిత కుటుంబానికి..

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామానికి చెందిన మల్యాల మాధురి అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. కాగా, కుటుంబాన్ని గ్రామానికి చెందిన మాజీ వైఎస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా తనవంతుగా రూ.5వేల సాయం అందించారు. మాధురి మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. చంద్రయ్య, రాజు, చంద్రమౌళి,శ్రీను, సంపత్‌యాదవ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



మృతిచెందిన పాడిఆవు వద్ద బాధిత రైతు

స్టేషన్‌ఘన్‌పూర్: సముద్రాల గ్రామంలో బత్తుల అనీల్ అనే రైతుకు చెందిన పాడి ఆవు విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సముద్రాల గ్రామానికి చెందిన అనీల్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి చెందిన పాడిఆవు వ్యవసాయ భూమి వద్ద మేతమేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. కాగా, ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తక్కువగా ఉండటంతో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. కాగా రూ.80వేల విలువైన పాడి ఆవు మృతిచెందిందని బాధిత రైతు ఆవేదన చెందాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తక్కువగా ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

- రఘునాథపల్లి రహదారి డబుల్ రోడ్డుగా మారేదెప్పుడో?
- పట్టించుకోని పాలకులు, అధికారులు



మట్టి రోడ్డుగా మారిన రఘునాథ్‌పల్లి బీటీ రోడ్డు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథ్‌పల్లి గ్రామం మీదుగా ఉన్న రోడ్డు గుంతలుపడి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా ధ్వంసమై కంకర తేలి బీటీ రోడ్డు మట్టి రోడ్డుగా మారింది. దీంతో ఈ రహదారి మీదుగా వాహనదారులు ప్రయాణించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కాజీపేట నుంచి వెంకటాపూర్ క్రాస్ మీదుగా రఘునాథ్‌పల్లి నుంచి కూనూర్, కోనాయిచలం గ్రామాల మీదుగా సాగరం క్రాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డును నిర్మించారు. ఇదే రోడ్డు మీదుగా జఫర్‌గఢ్ మండల కేంద్రం నుంచి అయా గ్రామాల ప్రజలతో పాటు గర్మిళ్లపల్లి, తిడుగు, ఉప్పుగల్లు, సాగరం తదితర గ్రామాల ప్రజలు, వాహనదారులు నిత్యం కాజీపేట, హనుమకొండ, వరంగల్ తదితర ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తుంటారు. సుమారు 15 కిలోమీటర్లకు పైగా ఉన్న ఈ రహదారి అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వెళ్లాల్సి వస్తోంది.

కొద్ది రోజులకే దెబ్బతిన్న ప్యాచ్ వర్క్

ఇటీవల ప్రభుత్వం దెబ్బతిన్న రోడ్డు గుంతలు పూడ్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ. 9.50 లక్షల నిధులు మంజూరు చేసింది. ప్యాచ్ వర్క్‌కు సంబంధించి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నామమాత్రంగా పనులు చేశాడు. దీంతో కొద్దిరోజులకే ప్యాక్‌వర్క్ దెబ్బతింది. దీంతో లక్షల నిధులు వృథా అయ్యాయని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డబుల్ రోడ్డుగా మార్చాలి



సాగరం క్రాస్ రోడ్డు నుంచి కోనాయిచలం కూనూర్, రఘునాథ్‌పల్లి గ్రామాల మీదుగా వెంకటాపూర్ క్రాస్ రోడ్డు వరకు ఉన్న రహదారి దెబ్బతిని ఎన్నో ఏళ్లు అవుతోంది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో తరచుగా ప్రమాదాల జరుగుతున్నాయి. ఇప్పటికైనా రోడ్డును బాగు చేయడంతో పాటు డబుల్ రోడ్డుగా మార్చినట్లయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

\- పల్లె సంతోష్‌రెడ్డి, కూనూర్

ఎవరూ పట్టించుకోవడం లేదు



రోడ్డు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు గుండా నిత్యం అనేక మంది వాహనదారులు పట్టణాలకు ప్రయాణం సాగిస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. ఎప్పుడు ఏ గుంతలో పడి ప్రమాదాలు కొని తెచ్చుకోవాల్సి వస్తుందోనని భయంతో ప్రయాణం చేయాల్సి వస్తోంది. రోడ్డును బాగు చేసి ప్రజల ఇబ్బందులు తొలిగించాలి.

\- కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, కూనూర్

నీటి సమస్యపై మున్సిపల్ ఎదుట ధర్నా



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

స్టేషన్‌ఘన్‌పూర్: గత వారం రోజులుగా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎస్సీ కాలనీతో పాటు పలువార్డులలో నల్లాల ద్వారా నీరు సరఫరా కావడం లేదని స్థానిక ఎస్సీ కాలనీ 16వ వార్డుకు చెందిన మహిళలు బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులకు, మున్సిపాలిటీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నీరటి ప్రభాకర్ మాట్లాడుతూ వారం రోజులుగా నల్లాల ద్వారా నీరు రావడం లేదని, ఈ విషయమై పలుమార్లు ఫోన్‌లు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను తెలిపేందుకు వస్తే కార్యాలయంలో ఏ ఒక్కరూ అందుబాటులో ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత కాలనీలపై అధికారులు వివక్షతో వ్యవహరిస్తున్నారని, తక్షణమే స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నీరటి బాబు, నీరటి కొమురమ్మ, ఇల్లందుల శోభ, నీరటి ఎల్లమ్మ, ఎడ్ల వెంకటలక్ష్మీ, మరియ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



బైక్‌పై ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల/దేవరుప్పుల: నియోజకవర్గంలో గూడు లేని నిరుపేద అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు అందించడమే తమ సంకల్పమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం దేవరుప్పుల, కొడకండ్ల మండకేంద్రాల్లోని ఫంక్షన్ హాళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదోడి ఇంటి కలను ఇందిరమ్మ పథకం ద్వారా సాకారం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో రాజకీయాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారిగా మంజూరు చేయిస్తామన్నారు. కాగా, దేవరుప్పులలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం నుంచి ఎమ్మెల్యే బైక్‌పై ర్యాలీగా వెళ్లి సమావేశానికి చేరుకున్నారు. కార్యక్రమంలో బీసీ వేల్ఫేర్ ఆఫీసర్ రవీందర్, ఎంపీడీఓలు, తహసీల్దార్, ఎంపీఓ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే కుటుంబంలో వెలుగులు



గుడిసెవాసుల పిల్లలకు చదువుపై అవగాహన కల్పిస్తున్న అమ్మ ఫౌండేషన్ టీం

జనగామ: చదువుతోనే పేదింట్లో వెలుగులు నిండుతాయని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమ్ రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని గ్రేయిన్ మార్కెట్ ఏరియా గుడిసెవాసుల కాలనీకి వెళ్లి అక్కడ ఉన్న పిల్లకు విద్య గురించి అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న సమయంలో బాల, బాలికలను బడికి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు కుటుంబ పరంగా ఆర్థిక సమస్యలు ఉంటే, తాము అండగా ఉంటామన్నారు. చదువకు దూరంగా నిరుపేద పిల్లలు ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



జఫర్‌గఢ్: భూ భారతి సదస్సులో పాల్గొన్న రెవెన్యూ అధికారులు



పాలకుర్తి: విస్నూరులో దరఖాస్తుదారుడితో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న



తరిగొప్పుల: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి

పాలకుర్తి/తరిగొప్పుల/నర్మెట/జఫర్‌గఢ్/బచ్చన్నపేట: భూ సమస్యల పరిష్కారానికే గ్రామ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న, పలు మండలాల తహసీల్దార్లు అన్నారు. బుధవారం పలు గ్రామాల్లో అధికారులు భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రైతులు అధైర్య పడకుండా భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకుని వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. తహసీల్దార్లు మహిపాల్‌రెడ్డి, వెంకట రామానుజా చార్యులు, శంకరయ్య, ఎం.నాగేశ్వరాచారి, చంద్రమోహన్, ఫణికిషోర్, డీటీలు, ఎస్ఏలు, ఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.



నర్మెట: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామానుజాచార్యులు



బచ్చన్నపేట: బండనాగారంలో దరఖాస్తు చేస్తున్న రైతులు

'స్థానికం'లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

రఘునాథపల్లి: నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం నిడిగొండ వెంకటేశ్వర గార్డెన్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ అధ్యక్షతన జరిగిన మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని.. సమర్థులకే పదవులు రానున్నాయన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పదవుల కోసం జిల్లా పరిశీలకులు లింగం యాదవ్‌కు దరఖాస్తులు అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి, బొనాసి క్రాంతికుమార్, గొరిగ రవి పాల్గొన్నారు.

రైతు సమస్యలు అర్థం చేసుకోండి



చీటూరులో జరిగిన భూభారతి గ్రామసభలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

లింగాలఘణపురం: భూ భారతిలో దరఖాస్తు చేసుకొనేందుకు వచ్చిన రైతుల సమస్యలను ముందుగా అర్థం చేసుకోవాలని, అనంతరం హెల్ప్‌డెస్క్ సహకారంతో తప్పులు లేకుండా దరఖాస్తులు నింపాలని రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. బుధవారం చీటూరులో జరుగుతున్న గ్రామసభను ఆయన సందర్శించారు. దరఖాస్తులు తీసుకుంటున్న తీరును పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. రైతులు తమ భూముల సమస్యలను పరిష్కరించుకొనేందుకు మంచి వేదికని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా నేలపోగులలో జరిగిన గ్రామసభను ఆర్డీఓ గోపీరామ్ సందర్శించారు. తహసీల్దార్ రవీందర్, డీటీ షాకీర్, ఆర్ఐ కిశోర్, సీనియర్ అసిస్టెంట్ భగత్ పాల్గొన్నారు.

సంస్థాగత నిర్మాణంతోనే పార్టీ అభివృద్ధి



మాట్లాడుతున్న లింగంయాదవ్

లింగాలఘణపురం: సంస్థాగత నిర్మాణంతోనే పార్టీ అభివృద్ధి చెందుతుందని అధిష్టానం గుర్తించి తమను సంస్థాగత ఎన్నికల నిర్వహణకు నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుడు లింగం యాదవ్ అన్నారు. బుధవారం నెల్లుట్లలో జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల పార్టీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవులతో పాటు ఆయా గ్రామశాఖల అధ్యక్షుల నియామకం జరుగుతుందని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరిశీలించిన అనంతరం అధిష్టానం నియమిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో కొత్తపాత అనే తేడాలు ఏమీ ఉండవని, పని చేసే, చురుకైన కార్యకర్తలను నియమించడం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో జనగామ మార్కెట్ చైర్మన్ శివరాజ్‌యాదవ్, వైస్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్, పీఏసీఎస్ చైర్మన్లు ఉపేందర్, శ్రీశైలం, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు



పట్టణంలోని బాణాపురం రేషన్ షాపు వద్ద క్యూలో లబ్ధిదారులు

మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండదంతో లబ్ధిదారులకు పడిగాపులు తప్పడం లేదు. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపం, కేంద్రం, రాష్ట్రం వేర్వేరుగా ఇస్తున్న బియ్యం కోసం డీలర్ ఒక్కో లబ్ధిదారు నుంచి ఆరు సార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి వస్తోంది. ఉదయం వచ్చిన వారు ఇంటికి వెళ్లే సరికి మధ్యాహ్నం అవుతోంది. - జనగామ

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పదు

ఎన్పీడీసీఎల్ డీఈ రాంబాబు



కొమురయ్య దంపతులను సన్మానిస్తున్న డీఈ

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ ఉద్యోగులకు ఎప్పటికైనా విరమణ తప్పదని, విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వారికి సరైన గుర్తింపు తప్పక లభిస్తుందని ఎన్పీడీసీఎల్ స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ రాంబాబు అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని శివునిపల్లి సెక్షన్ ఇప్పగూడెం లైన్ ఇన్స్పెక్టర్ ముక్కెర కొమురయ్య ఉద్యోగ విరమణ అభినందన సభ కార్యక్రమాన్ని శివునిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా డీఈ రాంబాబు హాజరు కాగా ముందుగా ముక్కెర కొమురమ్మ, భారతమ్మ దంపతులను సెక్షన్ పరిధిలోని ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం డీఈ మాట్లాడుతూ లైన్ ఇన్స్పెక్టర్‌గా కొమురయ్య ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. సన్మాన గ్రహీత కొమురయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులు, తోటి విద్యుత్‌సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేష్, ఏడీఈ రణధీర్‌రెడ్డి, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు సీహెచ్.నరేందర్ రెడ్డి, వీరాంజనేయులు, మహేందర్, ఏఈ శివకుమార్, యాదగిరి, రాజ్‌కుమార్, రాజేందర్, యాదగిరి, రామాచారి, శ్రీధర్‌పటేల్, సుధాకర్, రవీందర్ రెడ్డి, విజయ్‌కుమార్, అన్వర్‌పాషా, సదన్, సాయిబాబా, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

నేడు 'ప్రెస్టన్'లో భూ భారతి సదస్సు

జనగామ: జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ కళాశాల ఆవరణలో నేడు(గురువారం) భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సు నిర్వహించడం జరుగుతుందని, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న సోమయ్య

జనగామ: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజే ఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) అని రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని పూసల భవన్‌లో సంఘ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గతంలో ఉన్న కమిటీని రద్దు చేయడం జరిగిందన్నారు. నూతన సన్నాహక కమిటీలో నీల నరేష్ బాబు, గూడూరు లెనిన్, చింతకింది కృష్ణమూర్తి, బొడ్డు రంజిత్, గూడూరు కరుణాకర్, కందుల నర్సింగరావు, వేముల నర్సింగం, కుచన సుప్రీం, గోవర్ధన్‌లను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లాల జగన్ గౌడ్, బండి విజయ్ కుమార్, పర్శరాములు, నవీన్ చారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోల్ టాక్స్ రద్దు చేయాలి

పాలకుర్తి టౌన్: కేబుల్ టీవీ ఆపరేటర్లపై విద్యుత్ శాఖ పోల్ టాక్స్ బలవంతపు వసూలను రద్దు చేయాలని బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ స్టేట్ మల్టీ సర్వీసెస్ కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాల్వంచ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని కలిసి కేబుల్ ఆపరేటర్లు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మేరుగు సోమేశ్వర్, కార్యదర్శి పి శ్రీమన్నారయణ, ఎండీ రహమన్, చెరిపెల్లి అశోక్, కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

తరిగొప్పుల: అంకుషాపూర్, జాలుబాయితండా గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికిగానూ 4వ విడత సామాజిక తనిఖీ బృందం చేపట్టిన నివేదికను చేపట్టిన పనులపై గ్రామసభ చేపట్టి నివేదికను ప్రజలకు తెలియజేశారు. గ్రామాల్లో చేపట్టిన ప్లాంటేషన్, రైతుల భూముల్లో చేపట్టిన పనులు,రోడ్డు ఫార్మేషన్ పనులపై ఆడిట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అమనగంటి మహేందర్, భూక్య రాజేందర్, టెక్నికల్ అసిస్టెంట్ మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్స్ రవి, హరిప్రసాద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అభిమన్‌గాంధీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



ఏఎస్సైకి ఫిర్యాదు అందజేస్తున్న రాజేష్‌నాయక్

కొడకండ్ల: పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్‌గాంధీనాయక్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అత్త పోరు తట్టుకోలేకనే ప్రజల ముందు ఎమ్మెల్యే కన్నీరుకార్చిందని వాట్సాప్ గ్రూప్‌లోఅభిమన్‌గాంధీ సంబోధించినందున అతనిపై నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు ఏఎస్సై కత్తి రమేష్‌కు ఫిర్యాదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల యూత్ అధ్యక్షుడు యాకేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ వెంకన్న, గఫూర్, శ్రీకాంత్, సిద్ధూ, సుధీర్ పాల్గొన్నారు.